# యువకవుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ


యువకవుల సమ్మేళనం పోస్టర్లను జాగృతి నాయకులతో కలిసి విడుదల చేస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మే 19 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ యువకెరటాలు పేరిట నిర్వహించనున్న యువకవుల సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విడుదల చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధ్యక్షతన నిర్వహించే ఈ సమ్మేళనంలో తెలంగాణ అస్తిత్వం, తాత్వికత, జీవన విధానం, చరిత్ర, భాష, సంస్కృతి, ఉద్యమం అనే అంశాలపై తెలంగాణాలోని యువ కవులు, కవయిత్రులు, 35 ఏళ్ల లోపువారు తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ భాషలలో కవితలను వినిపించే అవకాశం కల్పించారని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతీ పరిషత్‌లో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఇందులో పాల్గొనాలి అనుకున్న వారు ఈ నెల 26వ తేదీ లోపు తమ వివరాలను kavitha.telangana@gmail.com కి మెయిల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి మంచిర్యాల జిలా నాయకులు ఐద ప్రశాంత్, కందుల ప్రశాంత్, బీఆర్ఎస్ నాయకులు పడాల రవీందర్, పుల్లూరి మౌనిక, రాకేశ్, బిల్లా మారుతీ, గడ్డం మహేశ్, తోట రంజిత్, వికాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ బిల్లులచ్చేనా!

## ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారుల వెనుకంజ

- మరోవైపు అటవీ ప్రాంత గ్రామాల్లో పనులను అడ్డుకుంటున్న అధికారులు
- సుస్మీర్‌లో 22 ఇండ్లకు బ్రేక్
- మొదలు పెట్టాక ఆపేస్తే.. రోడ్డున పడుతామేమోనని ఆందోళన
- తర్జనభర్జన పడుతున్న పేదలు
- సొంతింటి కలపై నీలినీడలు


బేస్మెంట్ స్థాయిలో నిలిచిపోయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

| ఆసిఫాబాద్ జిల్లాకు మంజూరైన ఇండ్లు | మార్కింగ్ చేసినవి | బేస్మెంట్ స్థాయిలో ఉన్నవి | ఇప్పటికీ ప్రారంభంకానివి | బిల్లులు వచ్చిన ఇండ్లు |
|---|---|---|---|---|
| 1699 | 920 | 215 | 705 | 40 |


అటవీ అధికారులు అడ్డుకోవడంతో సుస్మీర్ గ్రామంలో నిలిచిపోయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తున్నది. అప్పో.. సప్పో తెచ్చి ఇల్లు కడితే కాంగ్రెస్ సర్కారు బిల్లులు ఇస్తుందో.. లేదోనన్న సందేహం వారిలో కలుగుతున్నది. ఇక అటవీ ప్రాంతాల్లో నిర్మాణాలు చేపడితే సంబంధిత అధికారులు వచ్చి ఎక్కడ అడ్డుకుంటారోనన్న ఆందోళన సైతం కనిపిస్తున్నది. ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయన్న సంతోషంలో ఉన్న ఇండ్లను కూల్చేస్తే.. రోడ్డున పడాల్సి వస్తుందేమోనన్న భయం వెంటాడుతున్నదని పలువురు పేర్కొనడం చర్చనీయాంశమవుతున్నది.

### 705 ఇండ్ల నిర్మాణం మొదలే లేదు..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లోని 15 గ్రామాలకు ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద 1669 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసింది. ఇందులో 920 ఇండ్ల నిర్మాణాలకు అధికారులు మార్కింగ్ చేశారు. దాదాపు రెండు నెలల్లో 215 ఇండ్లు మాత్రమే బేస్మెంట్ వరకు చేరాయి. మార్కింగ్ పూర్తయినా ఇంకా 705 ఇండ్ల నిర్మాణం ప్రారంభమే కాలేదు.

### సుస్మీర్‌లో నిర్మాణాలను అడ్డుకున్న అటవీ అధికారులు

బెజ్జూరు మండలం సుస్మీర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఇక్కడ 22 ఇండ్ల నిర్మాణం చేపడుతుండగా, ఇటీవల అటవీ అధికారులు వచ్చి వాటన్నింటినీ అడ్డుకున్నారు. దశాబ్దాల క్రితం ఏర్పడిన ఈ గ్రామంలో మంజూరైన ఇండ్ల నిర్మాణాలను అటవీ అధికారులు అడ్డుకోవడంతో లబ్ధిదారుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### బిల్లులు వస్తాయో..రావో..

ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయన్న సంతోషంలో ఉన్న ఇండ్లను తొలగించి.. వాటి స్థానంలో కొత్తగా నిర్మాణం చేపడితే అటవీ అధికారులు వచ్చి అడ్డుకుంటారేమోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ అదే జరిగితే ఇందిరమ్మ ఇండ్లు ఏమోగాని.. ఉన్న నీడను కోల్పోయి రోడ్డున పడాల్సి వస్తుందేమోనని భయపడుతున్నారు. జిల్లాలో అత్యధికంగా వ్యవసాయదారులే ఉన్నారు. ఇది సాగుకు పెట్టుబడులు పెట్టే సమయం. ఉన్న డబ్బులు కాస్త ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు పెడితే.. ఆ తర్వాత బిల్లులు రావడం ఆలస్యమైతే ఎలా అని తలలు పట్టుకుంటున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం కంటే ఉన్న ఇంట్లోనే ఉండడం మంచిదని అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికే అటవీ అధికారుల ఆంక్షలతో తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లోనే సరిగా వ్యవసాయం చేసుకోలేకపోతున్నారు. ఇప్పటికే సిర్పూర్ నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో అటవీ అధికారులు పక్కా ఇండ్లను నిర్మించుకోనివ్వడం లేదు. కనీసం తాగునీటికోసం బోర్లు కూడా వేయనివ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడితే అటవీ అధికారులు అడ్డుకుంటారనే అనుమానాలు లబ్ధిదారుల్లో కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

### 40 మందికే బిల్లులు..!

జిల్లాలో 920 ఇండ్ల నిర్మాణాలకు అధికారులు మార్కింగ్ ఇచ్చినప్పటికీ కేవలం 215 ఇండ్ల నిర్మాణాలే బేస్మెంట్ వరకు చేరుకున్నాయి. ఇంకా 705 ఇండ్ల నిర్మాణాలు అసలు ప్రారంభమే కాలేదు. బేస్మెంట్ వరకు నిర్మించుకున్న లబ్ధిదారుల్లో ఇంతవరకు కేవలం 40 మందికే బిల్లులు పడినట్లు తెలుస్తున్నది. అటవీ అధికారుల ఆంక్షలు ఓ వైపు.. బిల్లులు వస్తాయోరావోనన్న సందేహాలు మరోవైపు.. వెరసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

# అవినీతిని రూపుమాపడమే ఏసీబీ లక్ష్యం

- అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ తరుణ్‌జోషి
- సీసీసీనస్పూర్‌లో ఏసీబీ కార్యాలయం ప్రారంభం



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏసీబీ డైరెక్టర్ తరుణ్‌జోషి

సీసీసీ నస్పూర్, మే 19 : అవినీతిని రూపుమాపడమే లక్ష్యంగా ఏసీబీ పనిచేస్తుందని ఆ శాఖ డైరెక్టర్ తరుణ్ జోషి స్పష్టం చేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సీసీసీ నస్పూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మంచిర్యాల జిల్లా ఏసీబీ కార్యాలయాన్ని నార్త్‌జోన్ జాయింట్ డైరెక్టర్ రాధేశ్ మురళీ, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూలతో కలిసి ప్రారంభించారు. ముందుగా తరుణ్ జోషి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం నూతన కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏసీబీ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి మంచిర్యాలలో నూతన ఏసీబీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇది వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఏసీబీ సేవలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనసాగాయని, దూర భారంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వాటిని దృష్టిలో పెట్టుకుని మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు కలిపి మంచిర్యాలలో కొత్తగా ఏసీబీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డీసీపీ పర్యవేక్షణలో ఇక్కడి నుంచి కార్యకలాపాలు కొనసాగుతాయని చెప్పారు. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించడానికి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజలు నేరుగా తమ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించవచ్చని, తమ వెబ్‌సైట్‌కు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 216 మందిపై ఏసీబీ కేసులు నమోదు కాగా, అందులో 88 శాతం కేసుల్లో నిందితులకు శిక్ష పడిందని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 2024లో 12 కేసులు, 2025లో ఇప్పటి వరకు 5 కేసులు నమోదైనట్లు తెలిపారు. గతంలో నమోదైనా కేసుల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురికి శిక్షపడినట్లు చెప్పారు. ప్రజలు నిర్భయంగా ఏసీబీకి ఫిర్యాదులు అందించవచ్చన్నారు. ఇక్కడ ఆఫీస్ ఏర్పాటుకు సహకరించిన సింగరేణి సీఎండీ బలరాం నాయక్, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, కరీంనగర్ ఏసీబీ కోర్టు పీపీ జ్యోతి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# గోలేటి ఓసీపీని ప్రారంభించాలి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**


సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, మే 19 : ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలోని గోలేటి ఓసీపీని త్వరగా ప్రారంభించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వినతిపత్రం అందించి మాట్లాడారు. గోలేటి ఓసీపీ ప్రారంభమైతే బెల్లంపల్లి ఏరియాకు పూర్వవైభవం వస్తుందని, పరిసర ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ సందర్భంగా ఏరియాకు సంబంధించిన పలు సమస్యలపై సీఎండీతో చర్చించినట్లు ఆమె పేర్కొన్నారు.


ప్రమోషన్ పొందిన వారికి స్టార్‌ను తొడుగుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

# నిబద్ధతతో విధులు నిర్వహించాలి

**ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 19 : ప్రమోషన్ పొందిన ఏఎస్ఐలు నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు పేర్కొన్నారు. ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మీర్ ఉస్మాన్ అలీ, కౌటల పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బాబాజీ.. ఏఎస్ఐలుగా ప్రమోషన్ పొందగా సోమవారం జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో వారిని సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రమోషన్‌లు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఎంటీవో అంజన్న తదితరులు ఉన్నారు.

# నకిలీ విత్తనాలు అరికట్టాలి

నస్పూర్, మే 19 : జిల్లాలో నకిలీ విత్తనాల రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టేలా చర్యలు చేపట్టాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి కల్పనతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో బీటీ పత్తి విత్తనాలతో పాటు బోల్ గార్డ్ 1, 2 రకాలను చట్టబద్ధంగా ఉపయోగించడం జరుగుతుందని, బోల్‌గార్డ్ 3 రకాన్ని నిషేధించాని, దీనిని ఉపయోగించడం నేరమని తెలిపారు. మానవాళికి హానీ కలిగించే విత్తనాలు, ఎరువులను వినియోగించకుండా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నకిలీ విత్తనాల విక్రయదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఫెర్టిలైజర్ దుకాణాల యజమానులు విత్తనాలు, పురుగుల మందులు విక్రయించేటప్పుడు రైతులకు రశీదు అందించాలని, వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు.సీపీ మాట్లాడుతూ నకిలీ విత్తనాల విక్రయం, వినియోగాన్ని నియంత్రించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

# నీట మునిగిన వరి పరిశీలన

నెన్నెల, మే19 : ఇటీవల కురిసన అకాల వర్షాలకు గొల్లపల్లిలో నీటమునిగిన వరి పంటను సోమవారం వ్యవసాయ విస్తరణ అధికారి షైనీ పరిశీలించారు. కోతకు వచ్చిన పంట నీట మునగడంతో ధాన్యం తడిసి మొలకకు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షంతో నష్ట పోయిన రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టదార్ పాస్ పుస్తకం,బ్యాంకు ఖాతా బుక్ జిరాక్స్‌లను తీసుకొచ్చి గ్రామ పంచాయతీ కార్యాలంలో అందించాలని ఏఈవో తెలిపారు.


నేలకొరిగిన వరిని అధికారులకు చూపిస్తున్న రైతులు


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఎంవీ రమేశ్

# అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

**ఆసిఫాబాద్ జిల్లా జడ్జి ఎంవీ రమేశ్**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 19 : జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్‌పై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమినల్, సివిల్ కేసుల్లో కక్షిదారులకు అవగాహన కల్పించి అత్యధికంగా కేసులు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అనంత లక్ష్మి, అదనపు ఎస్పీ ప్రభాకర్, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజాన్, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ రద్దుకై 20న నిరసన

శ్రీరాంపూర్, మే 19 : లేబర్ కోడ్స్ రద్దు చేసి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, కనీస పెన్షన్ రూ. 29000 ఇవ్వాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తిస్తూ కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న సింగరేణి వ్యాప్తంగా కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. మే 20న జరిగే దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలను కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు ఇచ్చిన ఈ ఉమ్మడి పిలుపులో మా సంస్థ కూడా భాగస్వామిగా ఉన్నందున మే 20న జరగాల్సిన సార్వత్రిక సమ్మెను జూలై 9కి వాయిదా వేస్తూ చేసిన నిర్ణయానికి కట్టుబడి ఉన్నామన్నారు. నిరసన కార్యక్రమాలను చేపడుతామన్నారు.

# కంటైనర్ రూమ్‌ల సీజ్

నెన్నెల, మే 19 : నెన్నెల ప్రధాన రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా స్టీల్ కంటైనర్ రూమ్‌లు ఏర్పాటు చేస్తుండగా, రెవెన్యూ అధికారులు, పోలీసులు సోమవారం సీజ్ చేశారు. మూడు రోజుల క్రితం కంటైనర్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్న విషయంపై ఫిర్యాదు రావడంతో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకొని పనులు అడ్డుకున్నారు. యాజమాని కీసరి సాయిపై కేసు నమోదు చేశారు. సోమవారం యథావిధిగా కంటైనర్‌లో పనులు చేస్తుండగా, ఆర్ఐ సులోచన, నెన్నెల ఎస్ఐ ప్రసాద్ అక్కడికి చేరుకొని పనులను అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, కీసరి సాయి కుటుంబం మధ్య తోపులాట జరిగింది. సాయి తల్లి స్పృహతప్పి పడిపోయింది. ఆమెను వెంటనే బెల్లంపల్లి దవాఖానకు తరలించారు.


అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన స్టీల్ కంటైనర్‌ను సీజ్ చేస్తున్న పోలీసులు